## క్లుప్తంగా

### ఉపాధి హామీ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో రాజామణి

ఉప్పలగుప్తం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా గ్రామాల్లో నిర్వహించే పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఏపీవో వి.రాజామణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె గురువారం గ్రామసభల పర్యవేక్షణాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 17 పంచాయతీల పరిధిలో శుక్రవారం జరిగే ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సభల ద్వారా గుర్తించిన పనులకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తుందన్నారు. ప్రజలు పెద్దఎత్తున సభలకు హాజరయ్యేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏవో మూర్తి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

ముమ్మిడివరం: మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ టి.వెంకటరామిరెడ్డిని ఆళ్లగడ్డ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ముమ్మిడివరం కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియ మించలేదు.

### గణపతి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం


పందిరి రాట ముహూర్తం చేస్తున్న పట్టణ బంగారు, వెండి వర్తకులు

అమలాపురం టౌన్: స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరు మెయిన్ రోడ్డులో గణపతి చవితి ఉత్సవాలకు సంబంధించిన షరాబుల పందిరికి రాట ముహూర్తం బుధవారం ఘనంగా జరిగింది. బులియన్ అసోసియేషన్‌కు చెందిన బంగారు, వెండి వర్తకులు పందిరి రాట ముహూర్తాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బులియన్ అసోసియేషన్ ఏటా శ్రీఆది గణపతి వర్తక సంఘం పేరిట షరాబుల పందిరి ద్వారా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శి రాయుడు నాని, కోశాధికారి చవాకుల కృష్ణ, గౌరవాధ్యక్షుడు రేకపల్లి సూరిబాబు, అసోసియేషన్ ప్రతినిధులు బోణం సత్య వరప్రసాద్, నంబూరి సత్యనారాయణ మూర్తి, చింతలపూడి సత్తిబాబు, దండుమేను సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మిడివరం-2 వీఆర్వో సూర్యనారాయణ మృతి



ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ గొల్లల వీధి సచివాలయం వీఆర్వోగా పనిచేస్తున్న జి.సూర్యనారాయణ(61) గురువారం మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సూర్యనారాయణకు భార్య సూర్యావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, వీఆర్వోలు, సూర్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి తమ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ లెవల్-6 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీఅండ్ఏఆర్ కార్యదర్శి వి.జయశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ లెవల్-6 పోస్టులు మొత్తంగా 256 ఉన్నాయన్నారు. దాంట్లో జనరల్-104, ఎంబీసీ-46, ఎస్సీ-41, ఓబీసీ-28, ఈడబ్ల్యూఎస్-25, ఈబీసీ-5, బీసీఎం-5, బీటీ-1, ఎస్టీ-1, పీడబ్ల్యూడీ-10 పోస్టులు కేటాయించారన్నారు. దరఖాస్తులను ఈ నెల 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 20 వరకూ స్వీకరిస్తారన్నారు. ఈ ఉద్యోగాలను టైర్-1, టైర్-2 కాంపిటేటివ్ ఎగ్జామ్ ద్వారా భర్తీ చేస్తారన్నారు.

### కొబ్బరి కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

కొత్తపేట: కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ కొబ్బరి దింపు, ఒలుపు, నాడెం, మోత, తరుగుడు, పీచు, తాళ్లు, ఎగుమతి, దిగుమతిపై ఆధారపడి వేల మంది జీవనం సాగిస్తున్నారన్నారు. వారి సంక్షేమం కోసం ప్రత్యేక కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

# వ్యర్థాలతో ఆరోగ్యానికి అనర్థం

- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దోమల విజృంభణతో విష జ్వరాల వ్యాప్తి


మురమళ్ల రక్షిత మంచినీటి పథకం స్టోరేజ్ ట్యాంకు వద్ద పాడేసిన చెత్తాచెదారం

ఐ.పోలవరం: ఇళ్లు.. దుకాణాలు.. హోటళ్లలో మిగిలిపోయిన వ్యర్థాలు.. ఎక్కడపడితే అక్కడ పాడేస్తుండడంతో ప్రజారోగ్యానికి అనర్థంగా మారుతున్నాయి. జనావాసాల మధ్య పేరుకుపోతున్న చెత్తాచెదారానికి తోడు రోడ్ల మీద పడేస్తున్న తాగేసిన కొబ్బరి బొండాలు, ఖాళీ స్థలాల్లో నిలిచిపోయిన వర్షం నీటిలో పేరుగున్న దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు విజృంభిస్తున్నాయి.

**మైనర్ పంచాయతీల్లో లేని సిబ్బంది**

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో విష జ్వరాల తీవ్రత పెరుగుతోంది. ఇందుకు గ్రామాల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం కారణమవుతోంది. అమలాపురం నియోజకవర్గంలో మున్సిపాలిటీతో పాటు మూడు మండల పరిధిలో 60 పంచాయతీలు ఉన్నాయి. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు నాలుగు మండలాల పరిధిలో 63 పంచాయతీలున్నాయి. మేజర్ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు, చెత్తా చెదారం తొలగించే వ్యవస్థ ఉంది కాని, మైనర్ పంచాయతీల్లో అసలు సిబ్బందే లేరు. సిబ్బంది ఉన్న చోట కూడా పూర్తిస్థాయిలో పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదు. ఇక ఆయా గ్రామాల డంపింగ్ యార్డుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. మేజర్ పంచాయతీలకు సైతం డంపింగ్ యార్డులు లేవు. దీంతో రోడ్ల వెంబడి ఎక్కడపడితే అక్కడ చెత్తను పారబోస్తున్నారు. ఈ కారణంగా దోమలు పెరిగిపోతున్నాయి. మరీ ముఖ్యంగా తాగి పడేసిన కొబ్బరి బొండాలు, వర్షం వల్ల నిలిచిపోయిన నీటిలో పుడుతున్న ‘ఏడిస్’ దోమలు కుట్టడం వల్ల జనం డెంగ్యూ బారిన పడుతున్నారు. గత నెలలో గోదావరికి వరద వచ్చి పది రోజుల పాటు ముంపులో ఉండడంతో ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం మండలాల్లో పలు గ్రామాలో వరద ముంపులో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇక్కడ తాత్కాలిక పారిశుధ్య చర్యలు చేపట్టినా పల్లపు ప్రాంతాల్లో మాత్రం నీరు నిలిచిపోయింది. దీనివల్ల రెండు నియోజకవర్గాల పరిధిలో ఇటీవల విష జ్వరాల కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

**దోమల నివారణ మన చేతుల్లోనే**

- ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిన దోమలను నివారణ చాలా వరకూ జనం చేతుల్లోనే ఉంది. ఇళ్లు, హోటళ్లు, వ్యాపార సముదాయల నుంచి వస్తున్న చెత్తను రోడ్ల మీద వేయకుండా చూడాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి ఆవరణలో వాడిన నీరు నిల్వ లేకుండా చూడాలి.
- కొబ్బరి బొండాలు తాగిన తరువాత ఖాళీ గుళ్లలను డంపింగ్ యార్డులకు తీసుకెళ్లి వదిలేయాలి. అలాగే పాత టైర్లు, రుబ్బు రోళ్లలో వర్షం నీరు లేకుండా చూడాలి. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన వర్షం నీరు, వరద ముంపు నీరు డ్రైనేజీ, మురుగునీటి కాలువల్లోకి వెళ్లేలా దారులు తీయాలి.

**దోమలకు దూరంగా ఉండాలి**



ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. ప్రజలు దోమలు కుట్టకుండా దోమ తెరలు, కాయిల్స్ వాడాలి. తీవ్ర జ్వరం, రోజూ జ్వరం రావడం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాల్సి ఉంది.

– డాక్టర్ ఎంఎస్ రాజు,
పీహెచ్‌సీ వైద్యాధికారి,
కేశనకుర్రు, ఐ.పోలవరం మండలం

## అమలాపురంలో కమిటీ కుర్రోళ్ల సందడి


అమలాపురంలో ప్రేక్షకులతో మాట్లాడుతున్న చిత్ర నిర్మాత నిహారిక

అమలాపురం టౌన్: కమిటీ కుర్రోళ్లు సినిమా యూనిట్ అమలాపురంలో ఆ చిత్రం ప్రదర్శితమవుతున్న శ్రీలలితా థియేటర్‌లో గురువారం రాత్రి సందడి చేసింది. చిత్ర నిర్మాత నిహారిక థియేటర్‌లో కమిటీ కుర్రాళ్లు సినిమాను చూస్తున్న ప్రేక్షకులతో మమేకమై చిత్రం ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో విజయోత్సవ యాత్ర నిర్వహిస్తున్న చిత్ర యూనిట్ అమలాపురం రాగానే శ్రీలలిత థియేటర్ మేనేజర్ కె.త్రినాథ్ పూల బొకేలతో స్వాగతం పలికారు. కమిటీ కుర్రోళ్లు చిత్రంలో కోనసీమ ఫిలిం అసోసియేషన్‌కు చెందిన కొందరు నటీనటులు నటించారు. వారంతా యూనిట్‌తో కలిసి థియేటర్‌లో సందడి చేశారు. హీరోయిన్‌గా తనను ఆదరించినట్లే చిత్ర నిర్మాతగా కూడా ఆదరించినందుకు నిహారిక ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు యదువంశీ, థియేటర్ యాజమాని తోట రాము, సినీ రిప్రజెంటేటివ్స్ పి.ముని, వి.శ్రీనివాస్, ఆకుల హరి, ఎం.మామాజీ తదితరులు పాల్గొన్నారు.

## ‘అసెంబ్లీ’ పరిధిలో రెండు లక్షల సభ్యత్వాలు

అమలాపురం రూరల్: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు లక్షల సభ్యత్వాలు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అధ్యక్షతన బీజేపీ అమలాపురం పార్లమెంటు సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అమలాపురం సత్యనారాయణ విలాస్‌లో సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రతి మండలంలోని అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహన్ రావు, గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ తమలంపూడి రామ కృష్ణారెడ్డి, పాలూరి సత్యానందం పాల్గొన్నారు.

## పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి


వ్యాఘ్రేశ్వరంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అంబాజీపేట: ఖరీఫ్ పంట తొలి దశలో కాండం తొలుచు పురుగు(మండి పురుగు), ఆకు నల్ల, ఆకుముడత పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ రైతులకు సూచించారు. ఇరుసుమండలో రైతు సేవా కేంద్రం వద్ద ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన రైతు విత్తనోత్పత్తి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వరిలో విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో రైతు క్షేత్రాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కాండం తొలుచు పురుగు ఆశించిన వరి దుబ్బులోని పిలకలో మొవ్వు ఆకు చనిపోతుందన్నారు. దీని నివారణకు క్లోరాంట్రనిల్‌ప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా కార్బోఫ్యూరన్ 36 గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున వేసుకోవాలన్నారు. ఆకునల్లి ఆశిస్తే దాని నివారణకు నీటిలో కరిగే గంధకం 50 శాతం పొడిని 3 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకు ముడత నివారణకు క్లోరిపైరాఫాస్ 20 ఈడీ 2.5 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## స్త్రీల ఆసుపత్రిని వెల్లూరు ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం


అంబాజీపేట స్త్రీల ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ రూప్ సోలోమాన్

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతంలో 58 ఏళ్ల క్రితం స్థాపించి ఎన్నో ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్న అంబాజీపేట స్త్రీల ఆసుపత్రిని తమిళనాడులోని వెల్లూరు ఆసుపత్రి తరహాగా తీర్చిదిద్దుతామని తమిళనాడులోని స్కడ్డర్ మెమోరియల్ ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూప్ సోలోమాన్ వెల్లడించారు. అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి 58వ వార్షికోత్సవ వేడుకలు ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఎస్ఆర్‌కే హెవార్డు రాజ్ అధ్యక్షతన గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోలోమాన్ మాట్లాడుతూ తమిళనాడులోని స్కడ్డర్ ఆసుపత్రికి రెండు శతాబ్దాల చరిత్ర, అనుభవం ఉందని, ఎంతో పేరుగాంచిన రాయవెల్లూరు ఆసుపత్రికి మాతృ సంస్థ అని పేర్కొన్నారు. అంబాజీపేటలో ఉన్న స్త్రీల ఆసుపత్రిని మరిన్ని అధునాతన సదుపాయాలతో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా తీర్చిదిద్ది పేద ప్రజలకు మరింతగా సేవలందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య విభాగాలు ప్రారంభించి అధునాతన ల్యాబ్‌లను పరిశీలించారు. ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఎడతెరిపి లేని వర్షం


భారీ వర్షానికి నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న అంబాజీపేట ప్రధాన రహదారి

అంబాజీపేట: అల్పపీడనం కారణంగా అంబాజీపేట మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయాయి చెరువులను తలపించాయి. వర్షం కారణంగా రోడ్లపై చిరు వ్యాపారాలు వెలవెలబోయాయి. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, అధికారులు, వాహనదారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంబాజీపేట హైస్కూల్ ప్రాంగణం నీట మునిగింది. గత వారం రోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది.

## మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారమివ్వాలి

అమలాపురం టౌన్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన భారీ విస్ఫోటనంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి వంతున పరిహారం ఇవ్వాలని అమలాపురానికి చెందిన వర్కర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదంలో దివ్యాంగులైన క్షతగాత్రులకు రూ.50 లక్షల వంతున ఇచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫార్మా కంపెనీలు, కార్మిక శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలం చెల్లిన బాయిలర్లు ఉపయోగించడం, ఫార్మాలో పనిచేసే సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వలేకపోవడం, తరచూ తనిఖీలు చేయాల్సిన కార్మిక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి కారణాలతో ఇలాంటి పెను ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మెటీరియల్ కాంపోనెంట్ 60 శాతానికి పెంచడం సరికాదు

అమలాపురం టౌన్: ఉపాధి హామీ పనులు గుర్తించడం కోసం జరిగే గ్రామ సభల్లో మెటీరియల్ కాంపోనెంట్ నుంచి 60 శాతం పనులు గుర్తించే విధానం తగదని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు దడాల సుబ్బారావు అన్నారు. కూలీలతో చేయగలిగే 60 శాతం పనులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక గొల్లగూడెంలోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడారు. మెటీరియల్ కాంపోనెంట్ 60 శాతానికి పెంచి కూలీలకు పని దొరకని విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలనే పేరుతో సిమెంట్ సీసీ రోడ్లను యంత్రాలతో చేయించడం, భవనాలు, రోడ్ల నిర్మాణాలతో కూలీలకు పనులు లేకుండా చేయాలన్న ఆలోచన సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పంగల యానిమేటర్‌పై విచారణ


ఉప్పంగల గ్రామంలో యానిమేటర్ అవినీతిపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఉప్పంగల యానిమేటర్(వీఓఏ) కేసనకుర్తి భానుకుమారి అవినీతిపై గురువారం మండల ఏపీఎం రెడ్డి సన్యాసిరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ రఘురాంలు విచారణ నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా పొందిన రుణాలకు సంబంధించి డ్వాక్రా సంఘాల మహిళల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయడంతో పాటు పొదుపు డబ్బులను సొంతానికి వాడుకున్నారని గ్రూపు సభ్యులు ఈ నెల 19వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రుణ దరఖాస్తుకు రూ.500, రుణం మంజూరైన తరువాత లక్షకు రూ.3,000 చొప్పున యానిమేటర్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా తంగేటిపంపు గ్రామానికి చెందిన శ్రీఆంజనేయ డ్వాక్రా సంఘం గ్రూపు వద్ద రూ.7 వేలు, అలాగే శ్రీసాయిశక్తి డ్వాక్రా సంఘం గ్రూపు వద్ద రుణమాఫీ నగదు తీసుకునేందుకు గానూ రూ.10 వేలు అక్రమంగా వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగి బెదిరింపులకు పాల్పడుతుందని, ఈ అక్రమ వసూళ్లపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని ఏపీఎం సన్యాసిరావు తెలిపారు.

## అమలాపురంలో నిరసన ప్రదర్శన



అమలాపురంలో నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులనే రక్షించలేని ప్రభుత్వాలు సిగ్గు పడాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్(సీఐటీయూ) జిల్లా శాఖ ప్రతినిధులు, పలు ప్రజా సంఘాల నాయకులు అమలాపురం గడియారం స్తంభం సెంటరులో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు మహిళలు నినాదాలు చేశారు. వైద్య సిబ్బందికి రక్షణకు తక్షణమే ఒక సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు అన్ని స్థాయిల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.దుర్గా ప్రసాద్, నూకల బలరామ్, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా అంగన్ వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, జిల్లా ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు ఎస్తేరురాణి పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం


పేదలకు దుస్తులు అందజేస్తున్న ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం: సినీ నటుడు చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలం చిరంజీవి యువత ఆధ్వర్యంలో గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్‌మాదుర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, కడియం సందీప్, పోలిశెట్టి కన్నా, సత్తి చిన్న, నిమ్మకాయల రాజేష్, చీకట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు అన్న, వస్త్రదానం**

అమలాపురం టౌన్: సినీనటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు అమలాపురం గడియారం స్తంభం సెంటరులో పేదలకు అన్న, వస్త్రదానం గురువారం చేశారు. ఈ కార్యక్రమానికి అమలాపురం ఎంపీ గంటి హరీస్ మాథూర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, జాతీయ ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ నల్లా నాయుడు, వర్రే శేషుబాబు, పిండి రాజా, ఆర్డీఎస్ ప్రసాద్, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, బోణం సత్య వరప్రసాద్, వంటిద్దు బాబి తదితరులు పాల్గొన్నారు.

### బస్టాండ్ ఖాళీ స్థలం లీజుకు టెండర్లు

అమలాపురం రూరల్: అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న 2,730 గజాల(0.56 ఎకరాల) ఖాళీ స్థలాన్ని 15 ఏళ్ల కాలానికి అద్దె పాతిపదికన లీజుకు ఇవ్వటానికి టెండర్లు పిలుస్తున్నట్లు అమలాపురం ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారం ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి వచ్చే నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలు 13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు ఈడీ విజయవాడ జోన్-2 ఆఫీస్ నందు ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరుస్తారన్నారు. ఆసక్తి గల ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అమలాపురం డిపో మేనేజర్ మూర్తి కోరారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విలసవిల్లి, గొల్లవిల్లి, సన్నవిల్లి, నంగవరం, దీమనపల్లి, ఉప్పలగుప్తం, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, మునిపల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అమలాపురం ఏఈఈ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

**అమలాపురంలో..**

అమలాపురం రూరల్: అమలాపురం టౌన్, పేరూరు, కామనగరువు పరిధిలో 33 సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈదరపల్లి, నారాయణ పేట, ప్రభాకర్ నగర్, కె.అగ్రహారం, పోస్టల్ కాలనీ, కామనగరువు, ఎర్రవంతెన, హౌసింగ్ బోర్డు కాలనీ, గాంధీనగర్, మద్దలవారిపేట, అశోక్ నగర్, ముస్లింవీధి, పేరూరు, కొంకాపల్లి, ఎత్తు రోడ్, భూపయ్య అగ్రహారం, ఇమ్మిడివరప్పాడు ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

### వచ్చే నెల 14న లోక్ అదాలత్

అమలాపురం టౌన్: వచ్చే నెల 14వ తేదీన అమలాపురంలోని కోర్టుల సముదాయంలో లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు స్థానిక జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ గురువారం తెలిపారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్ బౌన్స్ కేసులతో పాటు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కక్షిదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొని లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించుకునే దిశగా సహకరించాలని ఆయన సూచించారు.

### జీఎస్టీ కమిషనర్‌గా మిలింద్

యానాం: పుదుచ్చేరి గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ) నూతన కమిషనర్‌గా ఆర్.మిలింద్ లాంజ్వేర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ జీఎస్టీ కమిషనర్స్ ఆఫ్ కస్టమ్స్ అండ్ జీఎస్టీలను బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో మిలింద్ నియామకం జరిగింది. గతంలో ఆయన భోపాల్‌లోని జీఎస్టీ అండ్ యాంటీ నార్కోటిక్స్ ట్రైనింగ్ సెంటర్‌లో జనరల్ కస్టమ్స్ డైరెక్టర్‌గా పనిచేశారు.

### సమావేశానికి హాజరు కావద్దు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే విధానాన్ని మరింత వేగవంతం చేసేలా ఢిల్లీలో కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశానికి పుదుచ్చేరి అధికారులెవరూ హాజరు కావద్దని కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎం సలీమ్ కోరారు. పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్ ప్రైవేటీకరణను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

### మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

యానాం: యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఫ్యాషన్ టెక్నాలజీ(స్త్రీలకు) ట్రేడుల్లో 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఆసక్తిగల యానాం ప్రాంత అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాం


పాఠశాలలో పరిస్థితులను ఎంపీకి వివరిస్తున్న పీడీ ఫణీంద్ర

ఉప్పలగుప్తం: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఎంపీ హరీష్ మాథుర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆడిటోరియం, డైనింగ్ హాల్ నిర్మించాల్సిన ఆవశ్యకతను ఎంపీ హరీష్‌కు గ్రామస్తులు, ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం ఆయనను హెచ్ఎం ఎల్.రాణి ఆధ్వర్యంలో పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, ఉపాధ్యాయులు సత్కరించారు.